## క్లుప్తంగా

### భూసార పరీక్షలు తప్పనిసరి



క్రిష్టిపాడు పొలాల్లో మట్టి నమూనాలు సేకరిస్తున్న వీఏఏ రంగారెడ్డి

**దొర్నిపాడు:** భూసార పరీక్షలతో పంటల సాగులో మంచి ఫలితాలు సాధించ వచ్చని మండల వ్యవసాయాధికారి ప్రమీల అన్నారు.మంగళవారం క్రిష్టిపాడు పొలాల్లో వ్యవసాయ సిబ్బంది మట్టి నమూనాలు సేకరించారు. ఏఓ మాట్లాడుతూ భూ పరీక్షల వల్ల పొలంలో ఏ పంట వేస్తే ఎలాంటి దిగుబడులు వస్తాయో తెలుస్తుందన్నారు. అలాగే రసాయన ఎరువుల శాతం మన నేలలో ఎంతవరకు ఉందో పరీక్షల్లో బయట పడుతుందన్నారు. తద్వారా ఏ పంట వేయాలి, ఎంత రసాయప మందు వినియోగించాలి, నేల సారవంతంగా ఉదా? లేదా? అని తెలుస్తుందన్నారు. ప్రతి గ్రామాల్లో 60 మట్టి నమూనాలను సేకరిస్తున్నట్లు చెప్పారు. ఇందుకు రైతులు గ్రామ వ్యవసాయ సహాయకులకు సహకరించాలని ఆమె కోరారు.

### కొనసాగుతున్న వాసవీ మాత జయంత్యుత్సవాలు



శ్రీ వాసవీ మాత

**నంద్యాల(వ్యవసాయం):** శ్రీ వాసవీ కాన్యకాపరమేశ్వరి దేవి జయంత్యుత్సవాలు రెండోరోజు కొనసాగాయి. నూనెపల్లెలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం, మెయిన్ బజారులోని అమ్మవారి శాలలో ఆర్య వైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూనెపల్లెలో వాసవీమాతను వెండి చీరతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. అనంతరం స్వామివారికి బిల్వార్చన, చండీ హోమం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో నూనెపల్లె ఆర్యవైశ్య సంఘం నాయకులు సుబ్రహ్మణ్యం నాగరాజు శ్రీనివాసులు రజనీకాంత్, భావనశివాసు మహేష్, యువజన సంఘం మహిళా నాయకులు పాల్గొన్నారు.


### వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ



చండీ హోమంలో పాల్గొన్న భక్తులు

**నంద్యాల(వ్యవసాయం):** పట్టణంలోని కోటా వీధిలో వెలసిన శ్రీ కాళికాంబ చంద్రశేఖర స్వామి దేవస్థానంలో మంగళవారం అమ్మవారికి అష్టాదళ పాదపద్మారాధన సేవ అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయాన్నే పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి వడిబియ్యం కార్యక్రమం చేపట్టారు. 108 వెండి పుష్పాలతో అష్టాదళ పాదపద్మారాధన సేవా కార్యక్రమాన్ని శాస్త్రవేత్తంగా నిర్వహించారు అనంతరం మహా మంగళహారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, పండితులు రాఘవేంద్రాచారి, సుబ్బాచారి, విజయ్ కుమార్, ఆరవేటి వాసు, నరసింహ, లక్ష్మీదేవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### హామీని నిలబెట్టుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న దౌలత్‌ఖాన్ పోరాట కమిటీ నాయకులు

**నంద్యాల(న్యూటౌన్):** దౌలత్‌ఖాన్ కుటుంబానికి ఇచ్చిన హామీని న్యాయ శాఖ మంత్రి ఫరూక్ నిలబెట్టుకోవాలని దౌలత్‌ఖాన్ న్యాయ పోరాట కమిటీ కన్వీనర్ ఎజాస్ హుసేన్, అబ్దుల్‌సమ్మద్ డిమాండ్ చేశారు. మంగళవారం జమాత్ ఏ ఇస్లామి హింద్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మాజీ సైనికుడు దౌలత్‌ఖాన్ మరణించి మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ న్యాయం జరగలేదన్నారు. దౌలత్‌ఖాన్ మరణానికి కారణమైన మున్సిపల్ సిబ్బందిపై చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ఈనెలాఖరులోపు దౌలత్‌ఖాన్ కుటుంబానికి ఆర్థిక భరోసాతో పాటు ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించకపోతే విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమావేశంలో నాయకులు బాబాఫకృద్దీన్, సుహేల్‌రాణా, నూరుల్లా, ఎస్‌డీపీఐ నాయకులు పాల్గొన్నారు.

### ఎడ్ల బండలాగుడు పోటీలు

**డోన్ రూరల్:** మండల పరిధిలోని చింతలపేట గ్రామంలో శ్రీశ్రీశ్రీ జగద్గురు మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆరాధన మహోత్సవం సందర్భంగా బుధవారం ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు, కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. గెలుపొందిన వృషభాల యజమానుకు రూ.30 వేలు, రూ.20వేలు, రూ.10 వేలు, రూ.5వేలు, రూ.3వేల చొప్పున నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే 8వ తేదీన గుండు ఎత్తే పందెం, మోటర్ సైకిల్ స్లో రేస్ నిర్వహించి నగదు బహుమతులు అంజేస్తామన్నారు.



వార్తా పత్రికలు చదువుతున్న విద్యార్థులు



పిల్లలకు కథలు చెబుతున్న రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు

## విజ్ఞానం.. వినోదం

పాఠశాలలకు సెలవులొచ్చాయి. పిల్లలు ఆటలాడేందుకు బయటికి వెళ్లాలంటే ఎండలు మండిపోతున్నాయి. దీంతో నీడలో ఆటలు ఆడేందుకు ఇష్టపడుతున్నారు. అయితే చేతిలో సెల్ ఉందని మొబైల్ గేమ్‌లు ఆడితే కళ్లకు ఇబ్బంది ఏర్పడటంతో పాటు మానసిక రుగ్మతలు తలెత్తే పరిస్థితి ఉంది.. ఇప్పటికే ఎంతో మంది చిన్నారులు సెల్‌ఫోన్ ప్రభావంతో అటు చదువులు, ఇటు ఆరోగ్యాన్ని కోల్పోతున్నారు. దీంతో కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలను వేసవి శిక్షణ శిబిరాలకు పంపుతున్నారు. మండలకేంద్రం శిరివెళ్లలోని గ్రంథాలయంలో గత నెల 28 నుంచి విజ్ఞాన శిబిరం ప్రారంభమైంది. ఇందులో పిల్లలకు చెస్, క్యారం బోర్డు, యోగా, నీతి కథలు, చిత్ర లేఖనం, వార్తా పత్రికల చదవటం నేర్పిస్తున్నారు. విజ్ఞానంతో పాటు వినోదం అందించే ఈ శిబిరానికి గ్రామీణ విద్యార్థుల నుంచి విశేష స్పందన లభిస్తుంది. –శిరివెళ్ల



చెస్ ఆడుతున్న చిన్నారులు



క్యారం బోర్డు ఆడుతున్న బాలికలు

## ‘కళారాధన’ సేవలు ప్రశంసనీయం

**నంద్యాల(వ్యవసాయం):** కళారాధన సాంస్కృతిక సంస్థ గత 25 సంవత్సరాలుగా అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. కళారాధన రజతోత్సవం సందర్భంగా ఏడాది పొడవునా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన లోగోను మంత్రి ఫరూక్ తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. కళారాధన సంస్థ చేపట్టే కార్యక్రమాలకు తమ సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ రవికృష్ణ పాల్గొన్నారు.

**ఉచిత శిక్షణ శిబిరం ప్రారంభం**

కళారాధన ఉచిత లలిత కల శిక్షణ శిబిరాన్ని స్థానిక టౌన్ మునిసిపల్ హైస్కూల్‌లో మంగళవారం సీనియర్ న్యాయవాది వెదుళ్ల రామచంద్రరావు జ్యోతి ప్రజ్వల చేసి ప్రారంభించారు. శిబిరంలో శాస్త్రీయ, ఆధునిక నృత్యాలు, శాస్త్రీయ సంగీతం, లలిత సంగీతం, వాద్య సంగీతంలో గిటార్ కీబోర్డు మిమిక్రీ తదితర అంశాల్లో 30 మంది కోచ్‌లతో శిక్షణ శిబిరాలు నడుపుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ మధుసూదన్ రావు, డాక్టర్ రవి కృష్ణ, నిజాముద్దీన్, సిరిగిరి రమేష్ రంగనాథ్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.



కళారాధన రజతోత్సవ లోగో ఆవిష్కరిస్తున్న మంత్రి ఫరూక్

## ఏపీసీపీడీసీఎల్ సీఎండీకి అభినందనలు



పుల్లారెడ్డిని శాలువాతో సత్కరిస్తున్న అసోసియేషన్ నాయకులు

**నంద్యాల(అర్బన్):** ఏపీసీపీడీసీఎల్ సీఎండీగా నియమితులైన పుల్లారెడ్డిని పవర్ డిప్లొమో ఇంజినీర్స్ అసోసియేషన్(పీడీఈ) నాయకులు మంగళవారం కర్నూలులో కలిసి అభినందనలు తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు ప్రసాద్, నంద్యాల జిల్లా కార్యదర్శి రామయ్య మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా హైదరాబాద్‌లో చీఫ్ ఇంజనీర్‌గా, సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ తిరుపతిలో డైరెక్టర్‌గా పని చేసిన పుల్లారెడ్డి విద్యుత్ సంస్థ అభివృద్ధికి కృషి చేశారన్నారు. ఎంతో అనుభవం ఉన్న ఆయన అమరావతి కేంద్రంగా ఉన్న సీపీడీసీపీఎల్ సీఎండీగా నియమితులు కావడం సంతోషంగా ఉందన్నారు. అభినందించిన వారిలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నాగరాజు, జిల్లా అధ్యక్షుడు నాగభూషణం, సెక్రటరీ మదన్‌మోహన్ ఉన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు విఫలం

**నంద్యాల(న్యూటౌన్):** జిల్లాలో హత్యలు, దాడులు, హత్యాయత్నాలు తరచుగా జరుగుతున్నా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్ అన్నారు. మంగళవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ నంద్యాల జిల్లా ఏర్పడిన తర్వాత జిల్లాలో హత్యలు, అత్యాచారాలు, దాడులు పెరిగిపోయాయన్నారు. కొందరు అధిక వడ్డీలు చెల్లించలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ఇలాంటి ఘటనల పట్ల పోలీసు యంత్రాంగం ప్రేక్షక పాత్ర పోషిస్తుందన్నారు. కొత్తగా వచ్చిన జిల్లా ఎస్పీ ప్రజలకు భద్రతపై భరోసా కల్పించాలన్నారు. సమావేశంలో సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు ప్రసాద్, సోమన్న, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రంగనాయుడు

## ఆశా కార్యకర్తలకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న వైద్యాధికారిణి పి.అంజలి

**చాగలమర్రి:** మండలంలోని చాగలమర్రి, ముత్యాలపాడు పీహెచ్‌సీ పరిధిలో విధులు నిర్వహిస్తున్న 30 మంది ఆశా కార్యకర్తలకు ఒక్కొక్కరికి రెండు చొప్పున చీరలను వైద్యాధికారిణి అంజలి పంపిణీ చేశారు. ఆశ డే సందర్భంగా స్థానిక సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారికి ఆ చీరలు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఆశ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

## నాసిరకం విత్తనాలు విక్రయిస్తే లైసెన్స్ రద్దు

**నందికొట్కూరు:** రైతులకు నాసిరకం విత్తనాలు విక్రయిస్తే లైసెన్స్ రద్ద చేస్తామని జిల్లా వ్యవసాయ అధికారి వైవీ మురళీకృష్ణ హెచ్చరించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ భవనంలో డీలర్లు, వ్యవసాయాధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ డీలర్లు సీడ్ లైసెన్స్‌లు రెన్యూవల్ చేయించుకోవాలన్నారు. ప్రతి నెలా 5వ తేదీ లోపు నివేదికనలను అందజేయాలన్నారు. విత్తనాలు కొనేటప్పుడు కంపెనీకి సంబంధించిన వాట్సాప్ సరిఫికెట్లు, పెస్టిసైడ్స్ కంపెనీలకు సంబంధించిన పీసీలు, ఫర్టిలైజర్స్ కంపెనీలకు చెందిన ఓ ఫార్ములాను లైసెన్స్‌లో జత చేసుకొని వ్యాపారం చేయాలన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ ఏడీఏ విజయశేఖర్, డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వైవీ మురళీకృష్ణ

## ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



హరినగరంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**రుద్రవరం:** ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయకమని ఎంసీఆర్‌పీ శివశంకర్ సూచించారు. మండల పరిధిలోని హరినగరంలో మంగళవారం ఆయన ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలన్నారు.

### భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

**దొర్నిపాడు:** ఎన్నో ఏళ్లగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు రీసర్వే ద్వారా శాశ్వత పరిష్కారం చూపనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ మాధవ రైతులకు మంగళవారం సూచించారు. ప్రస్తుతం రామచంద్రపురం గ్రామంలో భూ రీసర్వే పనులు జరుగుతున్నాయన్నారు. దొర్నిపాడుకు చెందిన రైతుల పొలాలు రామచంద్రాపురంలో ఉన్నాయన్నారు. రైతులు వెంటనే పొలాలకు సంబంధించిన పాసుపుస్తకాలు, ఆధార్, అవసరమైన ధ్రువపత్రాలను అందజేయాలని కోరారు. భవిష్యత్‌లో ఎలాంటి సమస్యలు రాకుండా రైతుల సమక్షంలోనే రీసర్వే చేస్తున్నట్లు చెప్పారు.

### ఎస్టీలకు రుణాలు మంజూరు చేయాలి

**నంద్యాల(న్యూటౌన్):** ఎస్టీ కార్పొరేషన్ ద్వారా ఎస్టీలకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని ఆల్ ఇండియా బంజార సేవా సంఘ్ రాష్ట్ర యువజన వర్కింగ్ ప్రెసిడెంట్ బాలునాయక్ మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే బీసీ, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నారనానరు. ఎస్టీ కార్పొరేషన్ ద్వారా కూడా రుణా లు మంజూరు చేసి గిరిజనులను ఆదుకోవాలన్నారు.

### ఎంప్లాయిమెంట్ రిటర్న్‌లు పంపాలి

**నంద్యాల(అర్బన్):** నంద్యాల జిల్లా ఉపాధి కార్యాలయానికి సంబంధించిన పబ్లిక్, ప్రైవేటు ఎస్టాబ్లిస్మెంట్, ఎంప్లాయిమెంట్ రిటర్న్‌లు ఆన్‌లైన్ ద్వారా పంపాలని జిల్లా ఉపాధి కల్పనా అధికారి సోమశివారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రతి మూడు నెలలకు ఒక సారి మార్చి, జూన్, సెప్టెంబర్, డిసెంబర్) మాసాలకు సంబంధించి వెబ్‌సైట్ www.empoyme nt.ap.fpv.in ఎంప్లాయిమెంట్ ద్వారా రిటర్న్‌లు సమర్పించాలన్నారు. ఏదైనా సందేహాలు ఉంటే సెల్ : 9100598631ను సంప్రదించాలని కోరారు.

### ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలు

**శిరివెళ్ల:** విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ నాగార్జునరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో 25 శాతం సీట్లు పేదల పిల్లలకు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అర్హులు వివరాలు నమోదుకు ఈ నెల 19వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో రూ. 1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ. 1.44 లక్షలు ఆదాయం కలిగి ఉండాలన్నారు. 2019 జూన్ 2- 2020 మే 31 మధ్య జన్మించి, 5 సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. ఇతర వివరాలకు ఎంఈఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

### కోలుకోలేక ఒకరు మృతి

**చాగలమర్రి:** మండలంలోని నగళ్లపాడు గ్రామ సమీపంలోని 40వ నెంబరు జాతీయ రహదారిపై రెండు కార్లు ఢీకొన్న ఘటనలో కోలుకోలేక ఒకరు మృతి చెందారు. సోమవారం జరిగిన ఈ ప్రమాదంలో అరుగురు తీవ్ర గాయాలపాలైన విషయం తెలిసింది. వెంటనే క్షతగాత్రులను టోల్ ప్లాజా అంబులెన్సులో స్థానిక కేరళ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి తీవ్రంగా ఉన్న ముగ్గురిని నంద్యాల ఉదయానంద ఆసుపత్రికి తరలించారు. ఇందులో హైదరాబాద్ పట్టణానికి చెందిన నరేన్(17) అనే బాలుడు మంగళవారం మృతి చెందినట్లు చాగలమర్రి ఎస్ఐ సురేష్ తెలిపారు.



నూతనంగా నిర్మించిన దేవాలయం

## వైభవంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవం

**గోస్పాడు:** మండలంలోని తెల్లపురి గ్రామంలో యాదగిరి నరసింహస్వామి నూతన ఆలయం నిర్మించారు. ఈ నేపథ్యంలో మూడురోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తొలిరోజు మంగళవారం వేదపండితులు తాటిపాటి వెంకటరమణ శర్మ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం చేపట్టారు. ఉదయమే గంగా నయనం, గోపూజ, గణపతి పూజ, పంచగవ్య కరణము, అఖండ దీపారాధన, ప్రధాన కలశ స్థాపనలు, యంత్రాభిషేకాలు, మహా మంగళహారతి, హోమాలు చేశారు. ఈ కార్యక్రమాలను భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకొని తిలకించారు.



నూతన విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న వేదపండితులు

## సమస్యలు పరిష్కరించాలని ఆందోళన



నిరసన కార్యక్రమంలో సిబ్బంది

**గోస్పాడు:** గ్రామీణ ప్రాంతాల్లోని హెల్త్ క్లినిక్‌లలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా పనిచేస్తున్న వారి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీఎంసీఏ జిల్లా అధ్యక్షుడు శివకృష్ణ, జనరల్ సెక్రటరీ గురుప్రసాద్ డిమాండ్ చేశారు. నంద్యాల పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ఏపీఎంసీఏ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏపీఎంసీఏ సభ్యులు భాస్కర్, అఖిల్, భార్గవ్, హారిక తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యంపై అవగాహన అవసరం

**చాగలమర్రి:** కిశోర బాలికలు ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల అన్నారు.ఈనెల 2 నుంచి జూన్ 10 వరకు కిశోర బాలికలు, వారి ఆరోగ్య సంరక్షణ, బాల్య వివాహాలపై అవగాహన కల్పించటానికి అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు వేసవి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం చాగలమర్రిలోని 2వ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.



కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సుశీల

### వరి గడ్డి దగ్ధం

**వెలుగోడు:** మండలంలోని బోయరేవుల గ్రామంలో మంగళవారం వరిగడ్డి దగ్ధమైంది. రైతు పొలం నుంచి ట్రాక్టర్‌పై వరిగడ్డిని తీసుకు వస్తుండగా బోయరేవుల గ్రామంలోని సుంకులమ్మ గుడి సమీపంలో వీధి స్తంభాల వైర్లు తాకి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. నిప్పురవ్వలు గడ్డికి అంటుకోవడంతో అప్రమత్తమైన డ్రైవరు లిఫ్ట్ ఎత్తి గడ్డిని రోడ్డుపై వదిలారు. స్థానికులు మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో ట్రాక్టరుకు ఎలాంటి నష్టం కలగకపోయినా రూ.4 వేల విలువ చేసే గడ్డి కాలిపోయిందని డ్రైవర్ తెలిపారు.

### 9 మందిపై అట్రాసిటి కేసు నమోదు

**సంజామల:** మండల పరిధిలోని కానాల గ్రామానికి చెందిన 9 మందిపై మంగళవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమణయ్య తెలిపారు. కానాల గ్రామానికి చెందిన యాకోబు ఈనెల 4న ఉదయం తన ఆటోలో కూలీలను ఎక్కించుకుని వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన తలారి వెంకటేశ్వర్లు, మరో ఎనిమిది మంది ఆటోను అడ్డుకుని పాత కక్షలను మనస్సులో ఉంచుకుని కులం పేరుతో దూషిస్తూ విచక్షణ రహితంగా కట్టెలతో కొట్టారన్నారు. యాకోబు ఫిర్యాదు మేరకు ప్రాథమిక విచారణ జరిపి బోయ వెంకటేశ్వర్లు, బోయ మురళి, బోయ తలారి వెంకట సుబ్బయ్య, బోయ తలారి కిరణ్, బోయ తలారి శ్రీను, బోయ తలారి రవీంద్ర, బోయ తలారి లక్ష్మిదేవి, బోయ తలారి సుధారాణి, బోయ తలారి వరాలుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని వెల్లడించారు.

## అవకాశాలు అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా అధికారి డాక్టర్ వేణుగోపాల్

**మహానంది:** విద్యార్థులు, నిరుద్యోగులు అవకాశాలను అందిపుచ్చుకుని లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా యువజన సంక్షేమశాఖ అధికారి డాక్టర్ కె.వేణుగోపాల్ సూచించారు. మహానంది వ్యవసాయ కళాశాలలో మంగళవారం వ్యవసాయ విద్యార్థులకు జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవి మంచి ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థి దశ నుంచే ఉద్యోగ అవకాశాల కోసం పోటీ పరీక్షల పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. వ్యవసాయ విద్యకు మంచి భవిష్యత్తు ఉందన్నారు. జిల్లా ఉపాధి కల్పన అధికారి సోమశివారెడ్డి, కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎల్.వి జయభాస్కర్, సెట్కూరు సూపరింటెండెంట్ శ్యాంబాబు, కోచింగ్ నిపుణులు కృష్ణప్రదీప్, భవానీ శంకర్ పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాంలో వ్యక్తికి గాయాలు

**పాములపాడు:** మండలంలోని క్రిష్టారావుపేటలో కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిపై మంగళవారం టిప్పర్ – బైక్ ఢీకొన్న ప్రమాదంలో పాములపాడుకు చెందిన మండడి లోకేశ్వరరెడ్డికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. రహదారి పక్కన నిలిపి ఉన్న టిప్పర్‌ను బైక్ క్రాస్ చేసేక్రమంలో టిప్పర్‌ను డ్రైవర్ ముందుకు నడిపాడు. దీంతో టిప్పర్ బైక్‌కు తగలడంతో లోకేశ్వరరెడ్డి కింద పడ్డాడు. అయినా గమనించకుండా టిప్పర్ డ్రైవర్ ఇయర్‌ఫోన్స్ పెట్టుకుని టిప్పర్‌ను ముందుకు కదిలించడంతో లోకేశ్వరరెడ్డి కాలు పాదంపై ముందు టైర్ ఎక్కింది. స్థానికులు కేకలు వేస్తూ ముందుకు పరిగెత్తుకు రావడంతో టిప్పర్‌ను ఆపి డ్రైవర్ పరారయ్యాడు. పోలీసులు ఘనా స్థలాన్ని పరిశీలించారు. క్షతగాత్రుడిని వైద్యశాలకు తరలించారు.

## అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

**శ్రీశైలంటెంపుల్:** శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయ దక్షిణమాడవీధిలోని నిత్యకళావేదికపై విశాఖపట్నంకు చెందిన కళారాధన మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వారి సంప్రదాయ నృత్యప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో వినాయకప్రార్థన, శ్రీవప్పురాజంభజే, శివపాదమంజీరనాదం, శివతాండవం, శంభో శివ శంభో, పార్వతీకల్యాణం తదితర గీతాలకు సువర్చల, లక్ష్మీతన్మయి, దీక్షిత, లిక్షిత, స్నేహలత, లక్షయ తదితరులు నృత్యప్రదర్శన చేశారు.



దొర్నిపాడు శివారులో నేలకొరిగిన త్రీఫేజ్ లైన్ విద్యుత్ స్తంభాలు



ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో కిందపడ్డ హోర్డింగ్

## పట్టించుకోకపోతే ప్రమాదమే

**దొర్నిపాడు:** ఇటీవల వీచిన పెలుగాలులు, అకాల వర్షాలు రైతులను కోలుకోని దెబ్బతీశాయి. విద్యుత్‌శాఖకు కూడా తీవ్ర నష్టం కలిగించాయి. సుమారు 60 వరకు విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో అధికారులు వాటిని పునరుద్ధరించారు. కానీ దొర్నిపాడు-కంపమల్ల మధ్య రెండు విద్యుత్ స్తంభాలు నేల వాలగా అలానే వదిలేశారు. అలాగే ప్రభుత్వ పథకాల ప్రచారం కోసం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వేసిన హోర్డింగ్ కూడా గాలి తాకిడికి నేలవాలింది. వాటిని సరిజేయకపోతే ప్రమాదం జరిగే అవకాశం ఉంది.